క్లుప్తంగా

కార్మికులు ఐక్యంగా ఉండాలి



బీఎంఎస్ జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

జగిత్యాల/జగిత్యాలటౌన్: సుతారి భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. భారత్ మజ్దూర్ సంఘ్ 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కార్డు సంఘ సభ్యులందరికీ అందజేశామని, రానివారుంటే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లయ్య, గంగారాం, రమేశ్, రాజేశం, లచ్చన్న, రవీందర్, పెద్దన్న పాల్గొన్నారు.

బయో మైనింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కోరుట్ల: మున్సిపల్ డంపింగ్ యార్డులో నిర్వహిస్తున్న బయో మైనింగ్ విధానంపై మున్సిపల్ కమిషనర్ రవీందర్ గురువారం మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, మంత్రులు, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: మండలం కలిగోట సూరమ్మ ప్రాజెక్టు కుడి ఎడమ కాలువ పనుల భూసేకరణకు రూ. 10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు తొట్ల అంజయ్య, కల్లెడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్ఎఫ్ఐ నాయకులు

కథలాపూర్: ఈ నెల 28న హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే బీసీ రిజర్వేషన్ల ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల వినీత్ కోరారు. గురువారం కథలాపూర్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ వ్యాప్తంగా బడుగు బలహీనవర్గాలు చైతన్యమై రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్, మధు, మహేశ్, నితీన్, చందు, విష్ణు కోరారు.

జీపీ రికార్డుల పరిశీలన

బుగ్గారం: బుగ్గారం గ్రామపంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ గ్రామాభివృద్ధి కమిటీ గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (స్వచ్ఛంధ సంస్థ) సహకారంతో స్థానిక వీడీసీ సభ్యులు గురువారం జీపీ రికార్డులను పరిశీలించారు. గతంలో తాము అనుకున్న దానికంటే మరిన్ని అక్రమాలు బయటపడినట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. పరిశీలన అనంతరం వారు మాట్లాడుతూ నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సీనియర్ సభ్యుడు చుక్క గంగారెడ్డి,ఎన్‌హెచ్ఆర్‌సీ జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పం చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదల

జగిత్యాల: 2025–26 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు రూపొందించబడిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) చివరి విడతగా స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు.

అతి వేగానికి చెక్..

- రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు కఠిన చర్యలు
- ప్రధాన రోడ్లకు స్పీడ్‌గన్‌ల ఏర్పాటు
- నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానా
- రెండు శాఖల సమన్వయంతో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు



స్పీడ్‌గన్‌ను ప్రారంభిస్తున్న అప్పటి ఎస్పీ సింధూశర్మ (ఫైల్)

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రవాణా, పోలీసు శాఖల అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. తెలంగాణ రవాణాశాఖ అధికారుల ఆదేశాల మేరకు వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఎవరో ఒకరు నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి, ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోతున్నాయి. ప్రమాదాల్లో భారీ వాహనాలే ఎక్కువగా ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రవాణా శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో వేగ నియంత్రణ కోసం చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లకు స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేశారు. ఇది అతివేగంగా వెళ్లిన వాహనాలను స్పీడ్‌గన్‌లు కెమెరాలో చిత్రీకరిస్తుంది. దీనిని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు పోలీసు శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రోడ్ల విస్తీర్ణం, రోడ్ల పనితీరును బట్టి వేగ నియంత్రణను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సాధారణంగా భారీ వాహనాలు 60 స్పీడ్, సాధారణ వాహనాలు 80 వెళ్లాల్సి ఉంది. కానీ చాలా మంది వాహనదారులు నిబంధనలు అతిక్రమించి అతివేగంగా వెళ్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లాలో రెండు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో ఉన్న 8430 ట్రాన్స్‌పోర్టు వాహనాలు వేగ నియంత్రణ పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు అతివేగంగా వెళ్లే వాహనాలను స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తించి ఆయా వాహనాలకు జరిమానాలు మాత్రమే విధిస్తున్నారు. జిల్లాలో రోడ్ల వేగ నియంత్రణను గుర్తించి త్వరలోనే ఏ రోడ్డులో ఎంత వేగం, ఏ వాహనం ఎంత స్పీడ్ వెళ్లాలన్నిది రోడ్లకు ఇరువైపులా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ జరిమానాలు విధించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేంద్ర మోటార్ వాహనాల నిబంధన 118 ప్రకారం ట్రాన్స్‌పోర్టు వాహనాలు తప్పనిసరిగా వేగ నియంత్రణ పరికరాలు అమర్చుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధనలు గతంలోనూ ఉన్నప్పటికీ ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. పాఠశాలల బస్సులు, ప్రమాదకర పరికరాలు తరలించే వాహనాలు కేవలం 60 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించేలా వేగ నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



స్పీడ్‌గన్‌లు (ఫైల్)

సైన్‌బోర్డుల ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన రోడ్లతో పాటు చిన్న, సాధారణ రోడ్లలో వాహనాలు ఎంత వేగం వెళ్లాలనే దానిపై రవాణా శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్ల పరిస్థితిని బట్టి ఏ వాహనం ఎంత వేగం వెళ్లాలన్న దానిపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించనున్నారు.

వేగ నియంత్రణకే స్పీడ్ గన్‌లు



జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రధాన రోడ్ల వెంట స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు భారీ జరిమానాలు విధిస్తాం. అలాగే ఏ వాహనం ఎంత స్పీడ్ వెళ్లాలన్నదానిపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు రోడ్ల వెంట సైన్ బోర్డులు ఏర్పాటు చేశాం.

రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: దివ్యాంగుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనిని, దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దివ్యాంగుల స్వయం ఉపాధికి సంబంధించిన చెక్కులను గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలోని జైనా పర్యటనకు వెళ్లినప్పుడు గ్రామానికి చెందిన కోడూరి నరేశ్, సుధాకర్‌లనే ఇద్దరు అన్నదమ్ములు వికలాంగులు కావడంతో వారికి ట్రైసైకిళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి మంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి ట్రైసైకిళ్లు మంజూరయ్యేలా కృషి చేశారు. గురువారం మంత్రి అడ్లూరి మంత్రి చేతుల మీదుగా ట్రైసైకిళ్లను అందజేసారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాలలో గురువారం పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినప్పటికీ మేము అప్పులు కడుతూ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. అప్పారావు పేట గ్రామానికి చెందిన పొన్నం హన్మంతు, నాచుపెల్లి గ్రామానికి చెందిన బొడ్డేలి నాయకయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడం తో రైతు ప్రమాద బీమా రూ. 5 లక్షల ప్రొసీడింగ్ అందజేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లకు సంబంధించిన రూ. 22 లక్షలు విలువ చేసే 22 చెక్కులను అందజేశారు. అనంతరం కొడిమ్యాల ప్రెస్ క్లబ్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు జగిత్యాల క్రీడాకారిణి ఎంపిక



శాన్వి

జగిత్యాల/జగిత్యాల టౌన్: ఈనెల 25నుంచి 28వరకు చండీగఢ్‌లో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు జగిత్యాలకు చెందిన వేముల శాన్వి ఎంపిక అయినట్లు జగిత్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాఎం సంజయ్‌కుమార్(ఎమ్మెల్యే),ఆరె తిరుపతి గురువారం తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెంలో పలువురు లబ్ధిదారులకు గురువారం సీఎం సహాయనిధి చెక్కులను మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోపిడి మహిపాల్ రెడ్డి, మండల అధికార ప్రతినిధి హరీష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉమ్మడి రవి, తదితరులు పాల్గొన్నారు.

దొంగల కోసం గాలింపు

జగిత్యాలక్రైం: బీర్‌పూర్ మండలం రేకులపల్లికి చెందిన వృద్ధ దంపతులు సూరారపు గంగయ్య, రాజవ్వపై గుర్తుతెలియని దొంగలు దాడి చేసి కత్తులతో బెదిరించి రాజవ్వ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన విషయం తెల్సిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంతోపాటు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

కోరుట్ల: భారీ వర్షాలు కురుస్తున్నందునా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థ ఇళ్లల్లో నివసించే వాళ్లు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో 24/7 హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు సి.హెచ్ రాజేంద్ర ప్రసాద్‌శానిటరీ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 9949565606, బి. అశోక్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 9849907961 తో పాటు టోల్ ఫ్రీ నెంబర్ 9100039255 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కమిషనర్ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామ బీసీ సంఘం అధ్యక్షుడిగా రొట్టె శ్రీధర్ గురువారం ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాత నేరస్తుల బైండోవర్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలో పాత కేసుల్లో ఉన్న ఐదుగురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు పట్టణ పోలీసులు గురువారం సాయంత్రం జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ ముందు బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

రెండో దఫా అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి.

జగిత్యాలటౌన్: ఐటీఐలో చేరేందుకు రెండవ దఫా అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీందర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, కన్నాపూర్, తిమ్మాపూర్, బాలపల్లి, చెర్లపల్లి, హైదర్‌పల్లి, హన్మాజీపేట గ్రామాల్లో ఇటీవల కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను శుక్రవారం తిప్పన్నపేట శివారులోని బూసిగార్డెన్స్‌లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

నూతన ఫీడర్ బ్రేకర్ ప్రారంభం

మల్యాల: మండలంలోని మద్దుట్ల గ్రామంలో గురువారం డివిజనల్ ఇంజినీర్ రాజిరెడ్డి, అధికారులతో కలిసి కొత్త ఫీడర్ బ్రేకర్ ప్రారంభించారు. దీంతో మద్దుట్ల గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు విద్యుత్ అంతరాయం తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ మహేందర్, ఏఈఈ ఆకునూరి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సాతారం హైస్కూల్ విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ పాఠాలు

మల్లాపూర్: మండలంలోని సాతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటీ మద్రాస్ అధునాతన సాంకేతిక కోర్సుల్లోని మౌలిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని ఆ పాఠశాల హెచ్ఎం శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ విధానం ఆగస్టు నుంచి రెండు నెలల(8 వారాలు) పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఐఐటీ మద్రాస్ నుంచి ఈ–మెయిల్ ద్వారా లేఖ అందిందన్నారు. ఐఐటీ మద్రాస్ శిక్షణకి సాతారం జెడ్పీ హైస్కూల్ ఎంపికవడం పట్ల ఎంఈవో దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొడ్డు సుమలత,శ్రీనివాస్, వీడీసీ, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పరిశోధన స్థానం డైరెక్టర్‌ను కలిసిన రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధనస్థానం నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన హరీశ్‌కుమార్ శర్మను గురువారం అభ్యుదయ వ్యవసాయ వర్సిటీ సలహామండలి మాజీ సభ్యులురాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పరిశోధన స్థానంలో పంటల సాగుపై పరిశోధనలు చేయనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రమంత్రికి లేఖ

జగిత్యాల: జగిత్యాల నుంచి కరీంనగర్‌వరకు గల జాతీయ రహదారి 563 రోడ్డును వెంటనే విస్తరణ చేపట్టాలని జగిత్యాల మాజీ కౌన్సిలర్ అనుమండ్ల జయశ్రీ కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గట్కరికి లేఖ రాశారు. రెండు సార్లు భూసేకరణ చేపట్టినప్పటికీ ఇప్పటికీ పనులు మొదలు పెట్టలేదని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ పరిధిలో సైతం 45 కి.మీ ఉంటుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని మార్కెండేయ ఆలయంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానిని 80 మంది హాజరుకాగా, 45 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తిలో ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐ టెక్నీషియన్ ప్రభాకర్, లయన్స్ క్లబ్ నిర్వాహకులు బోగ చిన్న గంగాధర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)రోడ్డు గురువారం ఉదయం కురిసిన వర్షానికి జలమయమైంది. కేజీబీవీలోకి వెళ్లేందుకు విద్యార్థినులు, ఉద్యోగులు ఇక్కట్ల పాలయ్యారు. మరోవైపు కథలాపూర్ మోడల్‌స్కూల్‌కు వెళ్లే రోడ్డులో గుంతల్లో వర్షపునీరు నిల్వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డును అధికారులు త్వరగా మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్, పీఆర్ ఏఈ, కథలాపూర్ సెల్ నం.: 9100853882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643



కేటీఆర్ జన్మదిన వేడుకలు

జగిత్యాల/రాయికల్/పెగడపల్లి/మల్లాపూర్/మల్యాల/ధర్మపురి/కథలాపూర్/సారంగాపూర్/మేడిపల్లి/ బుగ్గారం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ నీటి వాటాను కాపాడుకుందాం

జగిత్యాల: గోదావరినదిలోని తెలంగాణ నీటి వాటాను కాపాడుకుందామని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, జిల్లా కో–ఆర్డినేటర్ రాజేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎల్ఎన్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఏపీ ప్రభుత్వం నీటి దోపిడీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరి నది నుంచి 200 టీఎంసీలను అక్రమంగా తరలించే కుట్ర చేస్తున్నారని, అయినా సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టకుండా సహకరిస్తున్నారన్నారు. విద్యార్థి లోకం ఏకమై బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మహేశ్, చిన్న, విజయ్, మహేశ్, నరేశ్, చింటు, మధు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

ఇబ్రహీంపట్నం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కార్యకర్తలు పనిచేయాలని ఇబ్రహీంపట్నం బీజేపీ మండల ఇన్‌చార్జి దోనికెల నవీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గుడేటి కాపు సంఘ భవనంలో బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, మండల కన్వీనర్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌యాదవ్, రణదీర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంప శ్రీనివాస్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకే డ్రైడే

మెట్‌పల్లి రూరల్: వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకే డ్రైడే నిర్వహిస్తున్నామని మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం రంగారావుపేటలో గురువారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగారు.ఇళ్ల పరిసరాలు పరిశీలించి,నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు.టైర్లు,కుండీలు,కూలర్లలో నీరు నిల్వ ఉంచొద్దని వివరించారు. అనారోగ్య సమస్యలుంటే వెంటనే ఏఎన్ఎంకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రియదర్శిని,పంచాయతీ కార్యదర్శి కల్యాణ్, అంగన్‌వాడీ టీచర్ సుమలత,ఆశ వర్కర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

జగిత్యాలక్రైం: బైండోవర్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన ముస్కు శిరీషా ఇటీవల గుడుంబా విక్రయించగా ఎక్సైజ్ అధికారులు పట్టుకుని అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ ముందు బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి ఇటీవల మళ్లీ శిరీషా గుడుంబా విక్రయించగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ ముందు ప్రవేశపెట్టగా రూ.25 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టిన రశీదును శిరీష ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సర్వేశ్వర్‌కు అందజేశారు.

మహిళలు ప్రైవేట్ ఫైనాన్స్‌లో రుణాలు తీసుకోవద్దు

కొడిమ్యాల: మహిళలు ప్రైవెట్ ఫైనాన్స్‌లలో లోన్లు తీసుకోవద్దని కొడిమ్యాల యూనియన్ బ్యాంక్ మేనేజర్ సంజీవ్ సూచించారు. లోన్లు అవసరం ఉన్నవారు స్వయం సహకార సంఘాల ద్వారా లోన్లు పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంజయ్, గోల్డ్ ఆఫీసర్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ పాత్రికేయుడు మృతి

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన సీనియర్ పాత్రికేయుడు నారాయణరెడ్డి (58) గురువారం వేకువజామున మృతి చెందారు. పలు పత్రికల్లో ఆయన రిపోర్టర్‌గా పనిచేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేశారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో స్థిరపడిన ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు పాత్రికేయులు, స్నేహితులు, బంధువులు నిజామాబాద్ వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నారాయణరెడ్డి మృతిపై బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు. చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఎమ్మెల్యేగా.. ఎంపీగా ఉన్న సమయంలో పార్టీ కోసం అహర్నిశలుగా పనిచేశారని, సాక్షి విలేకరిగా అందరి మెప్పు పొందారని గుర్తు చేసుకున్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి దోనికెల నవీన్, నాయకులు డాక్టర్ వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, తీగల శ్రీధర్‌రెడ్డి, బత్తుల శ్రీనివాస్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.